పాఠం 16

# భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎందుకు అవసరం? ఎన్నికల నిర్వహణకు గల వ్యవస్థ ఏమిటి, దాని పనితీరు ఎలా ఉంది, దానికి ఉన్న అధికారాలు ఏమిటి, ఎన్నికలు జరిగే ప్రతి దశలో తీసుకుంటున్న చర్యలు ఏమిటో ఈ పాఠంలో తెలుసుకుంటాం. అలాగే భారతదేశంలో ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎలా సజావుగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నాయో తెలుసుకొని ఇలా జరపడంలో ఎన్నికల కమిషన్ యొక్క పాత్రను అంచనావేస్తాం. ప్రస్తుత కాలానికి అనుగుణంగా ప్రజాస్వామ్య ప్రతిష్టను ఇనుమడింపజేయుటకు తీసుకోవలసిన సంస్కరణలను గురించి చర్చిస్తాం.




ఎన్నికల సమయాల్లో, వివిధ వార్తాపత్రికల్లోని పతాక శీర్షికలను జాగ్రత్తగా గమనించండి, ఇవి ఎవరి అధికారాలను గురించి సూచిస్తున్నాయి, వీటి ముఖ్యఉద్దేశ్యం ఏమై ఉండవచ్చు? చర్చించండి.

## భారత ఎన్నికల వ్యవస్థ

భారతదేశంలాంటి సువిశాల, అత్యధిక జనాభా కలిగిన దేశంలో ప్రజలంతా సమావేశం కావడం, చర్చించడం, నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదు, కాబట్టి ఇక్కడ ఎన్నికల అవసరం ఏర్పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం, స్వాతంత్ర్యం పొందిన నాటి నుండి ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్య విలువలకు గట్టి పునాదులు వేసుకుంది.



*చిత్రం: 16.1 బ్యాలెట్ బాక్స్*

దేశంలో ఎన్నికలను భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. ఈ సంఘం రాజకీయ పార్టీల కోసం "ఎన్నికల నియమావళి"ని రూపొందిస్తుంది. ఎన్నికల ఫలితాలను ప్రకటించి కేంద్ర లేక రాష్ట్రానికి సంబంధించిన ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఈ విధానం ద్వారా కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం అవుతుంది.

SCERT TELANGANA

## భారత ఎన్నికల సంఘం

భారత ఎన్నికల సంఘం 1950 జనవరి 25న ఏర్పడింది. ఇది ఒక స్వయంప్రతిపత్తి గల రాజ్యాంగ సంస్థ. తన అధికారంతో భారతదేశంలో ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించే బాధ్యత దానిపై ఉంది. ఓటర్ల జాబితాను రూపొందించి దేశంలో లోక్ సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసన సభలు, రాష్ట్రపతి మరియు ఉప రాష్ట్రపతి ఎన్నికలు నిర్వహిస్తుంది.




*చిత్రం 16.2: భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం*

> *2010, జనవరి 25 నాటికి భారత ఎన్నికల సంఘం ఏర్పడి 60 ఏండ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహించి, 2011 జనవరి 25న తొలి ఓటర్ల దినంగా ప్రకటించారు.*

## ఎన్నికల సంఘానికి స్వయం ప్రతిపత్తి

అధిక జనాభా ఉన్న భారతదేశంలో ఎన్నికల నిర్వహణ ఎంతో క్లిష్టమైన ప్రక్రియ. బ్రిటిష్ వారి పాలనా కాలంలో కేవలం 14% జనాభా మాత్రమే ఓటు హక్కును కలిగి ఉండేవారు. 1952 లో తొలి సార్వత్రిక ఎన్నికల సమయంలో 17.32 కోట్ల ఓటర్లుండగా, ప్రస్తుతం 67 కోట్లు దాటింది. మన దేశంలో ఈ భారీ ఎన్నికల ప్రక్రియను, ఎన్నికల సంఘం సుమారు 45 లక్షల సిబ్బందితో నిర్వహిస్తోంది.

> కేంద్ర ఎన్నికల సంఘానికి ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బంది లేరు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(6) ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్ల అనుమతితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందిని ఎన్నికల నిర్వాహణ కోసం తీసుకుంటుంది. ఆ సమయంలో ప్రభుత్వ శాఖలపై కేంద్ర ఎన్నికల సంఘానికే అధికారం ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి లేకుండా ప్రధాన నిర్ణయాలు తీసుకోకూడదు.




*చిత్రం 16.3: భారత ఎన్నికల కమీషన్ చిహ్నం*



## ప్రధాన ఎన్నికల కమీషనర్

ప్రధాన ఎన్నికల అధికారి భారతదేశంలో ఎన్నికల కమీషన్‌కు అధిపతి, జాతీయ మరియు రాష్ట్ర శాసనసభల ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా జరపడానికి ఇతనికి రాజ్యాంగ బద్ధంగా పలు అధికారాలు ఇవ్వబడ్డాయి. ఇతను సాధారణంగా భారత సివిల్ సర్వీసుకు చెందినవాడై వుంటాడు. ఇతని పదవీకాలం 6 సం॥లు లేదా 65 సం॥లు నిండేవరకు పదవిలో ఉంటాడు. మొదట ఎన్నికల సంఘం ఏకసభ్య సంస్థగా అనగా ఒక ప్రధాన ఎన్నికల అధికారితో మాత్రమే పనిచేసింది. దీన్ని 1993లో త్రిసభ్య సంస్థగా మారుస్తూ ఇద్దరు కమీషనర్లను అదనంగా నియమించారు.

- భారతదేశంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఇతర సంస్థల గురించి వివరాలు సేకరించండి.

- ప్రధాన ఎన్నికల కమీషనర్, ఇతర కమీషనర్లకు మధ్యగల అధికారాలు, హోదాలు, జీతభత్యాల్లో వ్యత్యాసాలు లేవు. నిర్ణయాలను సాధారణంగా ఏకగ్రీవంగా తీసుకుంటారు. లేకుంటే మెజార్టీ ప్రాతిపదికపై నిర్ణయాలను అమలుచేస్తారు.

భారత రాజకీయ వ్యవస్థలో ఎన్నికల కమీషన్ ప్రముఖ పాత్ర వహిస్తుంది, టి.ఎన్. శేషన్ (1990 –1996) కాలం నుండి గణనీయమైన ప్రజాభిమానాన్ని చూరగొన్నది. శేషన్ భారత ఎన్నికల్లో అవినీతిని అంతం చేయడానికి ఎంతో ప్రయత్నం చేశారు. అతని తరువాతనే ఎన్నికల కమీషన్ అధికారాల గురించి దేశ వ్యాప్తంగా ఒక గుర్తింపు వచ్చింది.

### టి.ఎన్. శేషన్ సిఫార్సులు

- *ప్రచార సమయాన్ని నామినేషన్ ఉపసంహరించుకునేందుకు నిర్ణయించిన తేదీ నుండి 14 రోజులుగా నిర్ణయించారు.*
- ఒక అభ్యర్థి ఒకేసారి రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుండి పోటీ చేయరాదు.
- ఒక వ్యక్తి ఏదైనా నేరంలో కనీసం 2 ఏండ్లు శిక్ష అనుభవిస్తే 6 ఏండ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలి.
- ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థి మరణిస్తే ఎన్నిక వాయిదా వేయాలి, కానీ రద్దు చేయకూడదు.
- ప్రచారం పూర్తి అయిన తరువాత 48 గంటల వరకు మద్యం అమ్మకాలు నిషేధించాలి.

## ఎన్నికల కమీషన్ విధులు

రాజ్యాంగంలోని 15వ భాగంలోని ఆర్టికల్ 324 నుండి 329 వరకు ఎన్నికల సంఘం నిర్మాణం, అధికార విధులను గురించి వివరించారు. ఈ అధికారాలను క్రింది విధంగా వివరించవచ్చు.

1. పాలనా సంబంధ విధులు
2. సలహా విధులు
3. పాక్షిక న్యాయ సంబంధ విధులు.

- ప్రారంభంలో రాజ్యాంగంలో ఓటింగ్ వయస్సు 21 ఏళ్ళు ఉండేది. కానీ 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా దాన్ని 18 సం॥లకు తగ్గించారు.

SCERT TELANGANA

పాలనా సంబంధ విధులలో ఓటర్ల జాబితాను రూపొందించడం, నిర్ణీత కాలవ్యవధిలో వాటిని సవరించడం, పార్లమెంట్ చేసిన పునర్విభజనకు సంబంధించిన చట్టాల ప్రకారం నియోజకవర్గాల భౌగోళిక పరిధిని నిర్ణయించడం, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం, ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, పోలింగ్ తేదీల ఖరారు, పర్యవేక్షణ, రాజకీయ పార్టీలను గుర్తించడం, గుర్తులను కేటాయించడం, ఎన్నికల సమయంలో పార్టీలు పాటించాల్సిన ఎన్నికల నియమావళిని రూపొందించి అమలుచేయడం, ఎన్నికల్లో జరిగిన అక్రమాల పరిశీలనకు విచారణాధికారులను నియమిస్తుంది.




పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ్యుల అనర్హతలకు సంబంధించి రాష్ట్రపతి, గవర్నర్లకు సూచనలిస్తుంది. పార్టీల మధ్య వివాదాలను విని పరిష్కరిస్తుంది. ఈ సందర్భంలో ఎన్నికల కమీషన్ పాక్షిక న్యాయస్థానంగా పనిచేస్తుంది.

ఎన్నికల కమీషన్ నియమావళి ప్రకారం ఎన్నికలు జరిగే సంవత్సరంలో ఆ ఏడాది జనవరి 1 నాటికి 18 సం॥లు నిండినవారు కుల, జాతి, మత, లింగ, భాషా పరమైన భేదాలు లేకుండా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు, దీనినే 'సార్వజనీన ఓటు హక్కు' అంటారు. ఓటర్లందరిని కలిపి 'ఎలక్టోరేట్' అంటారు.

## ఎన్నికలలో రాజకీయ పార్టీలు

మన దేశంలో నిబంధనావళిని రాసుకొని ఎన్నికల కమీషన్ దగ్గర రిజిస్టర్ చేయిస్తే ఓ రాజకీయ పార్టీ ఆవిర్భవిస్తుంది. ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు గుర్తులను కేటాయిస్తుంది. ఎన్నికలలోల పొందిన ఓట్ల శాతాన్ని బట్టి పార్టీలను ప్రాంతీయ, జాతీయ పార్టీలుగా ఎన్నికల సంఘం గుర్తిస్తుంది. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్లలో 3% ఓట్లు లేదా 3 శాసనసభ స్థానాలు పొందితే ఎన్నికల సంఘం ఒక పార్టీని ప్రాంతీయ పార్టీగా గుర్తిస్తుంది. సాధారణ ఎన్నికల్లో కనీసం 4 రాష్ట్రాలలో పోలైన ఓట్లలో 6% చొప్పున పొందిన ఓట్లు లేదా 4 వేర్వేరు రాష్ట్రాల నుండి 11 లోక్‌సభ సీట్లు సాధిస్తే అది జాతీయ పార్టీగా గుర్తింపు పొందుతుంది.

- ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన జాతీయ పార్టీల, ప్రాంతీయ పార్టీల గుర్తులలో కొన్నింటిని సేకరించండి.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనగా షెడ్యూలు ప్రకటించిన తేదీ నుండి ఎన్నికలు జరిగే తేదీ వరకు పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు పాటించవలసిన నియమ నిబంధనలను 'ఎన్నికల ప్రవర్తనా నియమావళి' అంటారు. వీటిని అతిక్రమిస్తే ఎన్నికల అనుచిత ప్రవర్తన (ఎలక్షన్ మాల్ ప్రాక్టీస్)గా పరిగణించి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారు.

SCERT TELANGANA

- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించినందుకు ఏ అభ్యర్థికైనా శిక్ష పడిందా? తెలుసుకోండి.
- ఏదైనా నేరానికి శిక్షపడి ఎన్నికల్లో పోటీకి లేదా పదవికి అనర్హులైన అభ్యర్థుల గురించి తెలుసుకోండి.

## అభ్యర్థుల ప్రవర్తనా నియమావళిలోని ముఖ్యమైన అంశాలు

1. పార్టీలు, అభ్యర్థులు జాతి, కుల, మత, ప్రాంతీయపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించకూడదు.
2. ఇతర రాజకీయ పార్టీలను, అభ్యర్థులను విమర్శించేటప్పుడు ప్రజాజీవితంతో సంబంధంలేని వ్యక్తిగత దూషణలు చేయవద్దు.
3. రాజకీయ ప్రకటనల ద్వారా జాతి, కుల, మతపరమైన అభ్యర్థనలు చేయకూడదు.
4. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థన, పవిత్ర స్థలాల్లో, పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు.
5. ఓటర్లకు లంచాలు ఇచ్చి ప్రలోభపెట్టడం గానీ, బెదిరించడం గానీ చేయకూడదు.
6. ఒకరి స్థానంలో మరొకరిని ఓటరుగా వినియోగించరాదు.
7. పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ప్రచారం నిర్వహించకూడదు.
8. గడువు దాటాక ప్రచారం చేయకూడదు.
9. పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లను తీసుకురావడం, తిరిగి తీసుకెళ్లడం వంటివి నిషిద్ధం.
10. ప్రశాంత జీవనం గడిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది. దానికి భంగం కలిగేలా ఇళ్లముందు నిరసన ప్రదర్శనలు, పికెటింగ్‌లు చేయడం నిబంధనలకు విరుద్ధం.
11. అనుమతి లేకుండా ఇళ్లపై జెండాలు ఎగురవేయడం, బ్యానర్లు కట్టడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం వంటివి చేయరాదు.

ఈ ఎన్నికల నియమావళిపై కొంతమంది అభ్యర్థులు, సంస్థలు కోర్టులను ఆశ్రయించడం జరిగింది.

## సభలు, సమావేశాలు, ఊరేగింపులు



1. పార్టీలు సభలు నిర్వహించాలనుకున్నప్పుడు ముందుగా సభ నిర్వహణ ప్రదేశం, సమయం గురించి తప్పకుండా స్థానిక పోలీసులకు సమాచారం అందివ్వాలి. దాన్ని బట్టి పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటారు.

SCERT TELANGANA

2. సభలు, సమావేశాలు, ఊరేగింపులు చేయాలనుకున్న ప్రాంతాల్లో ఏవైనా నిషేధాజ్ఞలు ఉన్నాయా అని అభ్యర్థులు ముందుగానే తెలుసుకోవాలి. నిషేధాజ్ఞలు అమలయ్యే ప్రాంతాలలోకి ప్రవేశిస్తే తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి.

- రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ఊరేగింపుల ద్వారానే ప్రచారం చేయాలా, ఇంకేవైనా ప్రత్యామ్నాయాలున్నాయా సూచించండి.

3. లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేయదలిస్తే ముందుగా అనుమతి తీసుకోవాలి. సభలు, సమావేశాలు, ఊరేగింపులకు ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై నేరుగా దాడికి పాల్పడకుండా పోలీసులకు సమాచారం అందించాలి.

## పోలింగ్ రోజున

1. ఓటర్లు ప్రశాంతంగా, ప్రజాస్వామికంగా ఓటు హక్కును వినియోగించుకునేలా వీలుకల్పించాలి.
2. అన్ని పార్టీలనేతలు ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు సహకరించాలి.
3. పోలింగ్ బూత్‌లలో కూర్చొనే పార్టీల ఏజెంట్లకు అధికార గుర్తింపు కార్డులు విధిగా అందజేయాలి. వీటిపై పార్టీల గుర్తులు, పేర్లు ఉండకూడదు.



*చిత్రం 16.8 : ఓటుహక్కును వినియోగించుకోవడానికి వరుసలో వస్తున్న ఓటర్లు*

4. ఎన్నికలకు 48 గంటలకు ముందుగా ప్రచారం నిలిపివేయాలి, ఎస్ఎంఎస్‌లు కూడా నిషిద్ధం, మద్యం పంపిణీ చేయకూడదు.
5. అభ్యర్థులు, వారి అనుచరులు పోలింగ్ బూత్‌ల సమీపంలో ఏర్పాటుచేసే శిబిరాల్లో పెద్ద సంఖ్యలో గుమిగూడ కూడదు.
6. శిబిరాల్లో పోస్టర్లు, జెండాలు, గుర్తులు ఇంకా ఏ ఇతర ఎన్నికల సామాగ్రి, తినుబండారాలు ఉంచరాదు.

### ఎన్నికలు: కోర్టు తీర్పులు

- డా॥ సుబ్రమణ్య స్వామి కేసులో 2013లో సుప్రీంకోర్టు, ఓటరు తన ఓటును వినియోగించుకున్న తరువాత తాను ఓటు వేసిన అభ్యర్థి పేరు, గుర్తు మొదలైన వివరాలతో కూడిన ముద్రిత పేపర్‌ను పొందడానికి వీలుగా ఈవీఎంలలో **ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వి.వి.పి.ఏ.టి.)** ఏర్పాటు చేయాలని పేర్కొంది.
- పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ కేసు 2013లో పోటీ చేస్తున్న అభ్యర్థులను కాదని వారికి ప్రతికూలంగా ఓటు వేసే అధికారం ఓటరుకు ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ తీర్పు అమలు చేయడానికి ఎన్నికల సంఘం నోటా(NOTA)ను ఏర్పాటు చేసింది.
- పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ కేసు 2013లో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలకు పోటీ చేసే అభ్యర్థి నేరచరిత్ర, జీవితభాగస్వామి, పిల్లలు, ఆస్తులు, అప్పులు, విద్యార్హత మొదలైన అంశాలతో కూడిన ప్రమాణపత్రాన్ని తప్పనిసరిగా వెల్లడించాలని పేర్కొంది.

SCERT TELANGANA

## ఎన్నికల సమయంలో అధికార పార్టీ

అధికారంలో ఉన్న పార్టీలు ఎన్నికల్లో తమ అధికారాన్ని దుర్వినియోగపరిచి ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీన్ని నివారించడానికి ఎన్నికల సంఘం కొన్ని నియమాలను రూపొందించింది అవి.

> **ఓటర్ల ప్రతిజ్ఞ**
>
> **భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామనీ, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు చేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము.**

1. అధికార దుర్వినియోగానికి పాల్పడకూడదు, పార్టీ పనులకు పాలనాయంత్రాంగాన్ని వినియోగించకూడదు.
2. అధికార పర్యటనలు, పార్టీ ప్రచార పర్యటనలు రెండూ కలిపి ఉండరాదు.
3. ప్రభుత్వ వాహనాలను ప్రచారానికి వాడరాదు.
4. సెక్యూరిటీ వాహనాలు మూడుకు మించితే దాన్ని ఎన్నికల వ్యయంలో చూపెట్టాలి.
5. ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థుల ప్రవర్తనా నియమావళి అనేది ఎన్నికల ప్రణాళిక-తేదీలు ప్రకటించిన తర్వాత అమలులోకి వస్తుంది.
6. ప్రభుత్వ వసతి గృహాలు, ఆఫీసులు మొదలైన ప్రభుత్వ ఆస్తులు ఏవికూడా పార్టీలు, ప్రచారానికి వినియోగించకూడదు.
7. పత్రికల్లో, టీవీల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారానికి ప్రకటనలు ఇవ్వకూడదు.
8. పత్రికల్లో, టీవీల్లో ఇచ్చే పార్టీ ప్రకటనలు ముందుగా ఎన్నికల సంఘానికి చూపించి అనుమతి తీసుకోవాలి.
9. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక ఎటువంటి గ్రాంట్లు, చెల్లింపులు చేయకూడదు, కొత్త పథకాలు ప్రకటించకూడదు. శంకుస్థాపనలు చేయకూడదు, హామీలు ఇవ్వకూడదు.

## వివిధ స్థాయిలలో ఎన్నికల నిర్వహణ

రాష్ట్రస్థాయిలో ఎన్నికల సంఘానికి సహాయకారిగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (స్టేట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్) ఉంటారు. కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి వీరిని నియమిస్తుంది. ఈ పదవికి రాజ్యాంగ ప్రతిపత్తి లేదు. సాధారణంగా సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారిని నియమిస్తారు. రాష్ట్రంలో జరిగే పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల ఎన్నికలు ఇతని పర్యవేక్షణలో జరుగుతాయి. జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ ముఖ్య ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు.

ప్రతి నియోజకవర్గంలో ఎన్నికలను నిర్వహించడానికి, పర్యవేక్షించడానికి ఒక అధికారిని నియమిస్తారు. ఈ అధికారిని 'రిటర్నింగ్' అధికారి అంటారు. ఓటర్ల జాబితాలో నమోదు కాబడి, ప్రతినిధిగా ఎన్నికగుటకు తగు అర్హతలు, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ 'నామ ప్రతిపాదన పత్రాలను' (నామినేషన్ పేపర్స్) 'రిటర్నింగ్' అధికారికి సమర్పిస్తారు. ఈ ఎన్నికల పత్రాలపై వారి అభ్యర్థిత్వాన్ని ఓటర్ల జాబితాలో పేరున్న వ్యక్తులు ప్రతిపాదిస్తూ, బలపరుస్తూ సంతకాలు చేయాలి. గుర్తింపు పొందిన పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులను ఆయా పార్టీల అభ్యర్థులంటారు. మిగతా వారిని స్వతంత్ర అభ్యర్థులంటారు.

SCERT TELANGANA

‘రిటర్నింగ్’ అధికారి తమకు సమర్పించిన నామ ప్రతిపాదనలను పరిశీలిస్తారు(స్క్రూటినీ). వాటిలో సక్రమమైన ప్రతిపాదనల జాబితాను ప్రకటిస్తారు. నిర్ణీత గడువులోగా ఉపసంహరించుకొనే అవకాశం కూడా ఉంటుంది. ఆ గడువు ముగిసిన తరువాత పోటీచేయు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. వీరికి ఆయా పార్టీలకు సంబంధించిన గుర్తులను కేటాయిస్తారు. స్వతంత్ర అభ్యర్థులకు అందుబాటులోని ప్రత్యేక గుర్తులను కేటాయిస్తారు. వాటిని అనుసరించి ఈ.వి.యం. (Electronic Voting Machine) లను సిద్ధం చేస్తారు. పార్లమెంట్ మరియు రాష్ట్ర శాసనసభలకు దాదాపు ఇలాంటి విధివిధానాలనే పాటిస్తారు. ఒకే నియమ నిబంధనలు అందరికీ వర్తిస్తాయి.



చిత్రం 16.9 :కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్

## ఓటింగ్ ప్రక్రియ

జిల్లా ఎన్నికల అధికారులు పోలింగ్ ఏర్పాట్లను విస్తృతంగా చేస్తారు. పోలింగ్ కేంద్రాలను నెలకొల్పి పోలింగ్ స్టేషన్లలో విధులు నిర్వహించడానికి ‘ప్రిసైడింగ్ ఆఫీసర్’ను నియమిస్తారు. ఇతనికి సహాయంగా మరికొంత మందిని ‘పోలింగ్ ఆఫీసర్స్’గా నియమిస్తారు. ఇంకొంత మందిని పర్యవేక్షణకు ప్రత్యేకంగా నియమిస్తారు.




**చిత్రం 16.10 :పోలింగ్ బూత్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది.**

పోలింగ్ రోజున ఓటర్ల జాబితాలో పేర్లున్న ఓటర్లందరినీ ఓటు వేయడానికి అనుమతిస్తారు. ఈ ప్రక్రియలో ఓటర్లను గుర్తించడానికి పోలింగ్ ఏజెంట్లు సహాయపడతారు. ఓటుహక్కును వినియోగించుకోబోతున్నవా రి ఎడమచేతి చూపుడువేలిపై చెరిగిపోని (ఇండెలిబుల్) సిరాగుర్తు పెడతారు. ఈ.వి.యం.లు కాకుండా బ్యాలెట్ డబ్బాలను వాడుతుంటే బ్యాలెట్ పత్రంలో స్వస్తిక్(卐) ముద్రవేసి, నిర్ణీత విధంగా మడిచి బ్యాలెట్ పెట్టెలో వేస్తారు.

పోలింగ్ పూర్తి అయిన తర్వాత ఈవియం/బ్యాలెట్ పెట్టెలకు సీలు వేసి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు తరలిస్తారు. అక్కడ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అత్యధిక ఓట్లు సాధించిన అభ్యర్థిని ఎన్నికైనట్లుగా ప్రకటిస్తారు. అతనికి లేదా ఆమెకు ఎన్నికల సంఘం ధృవీకరణ పత్రం ఇవ్వాలి.

SCERT TELANGANA

5 సం॥లకు ఒకసారి దేశం లేదా రాష్ట్రస్థాయిలో జరిగే ఎన్నికలను 'సాధారణ ఎన్నికలు' అంటారు. ఒకటి లేదా కొన్ని ఖాళీలకు నిర్వహించే ఎన్నికలను 'ఉప ఎన్నికలు' అంటారు. 5 సం॥ల పూర్తి కాలం గడవకముందే శాసన సభకు లేదా పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహిస్తే వాటిని 'మధ్యంతర ఎన్నికలు' అంటారు.

## తిరస్కరించే ఓటు నోటా (NOTA None Of The Above)




చిత్రం 16.11 : నోటా గుర్తు

2013లో పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా దీన్ని ప్రవేశపెట్టారు. నోటా అనేది వ్యక్తి భావప్రకటన స్వేచ్ఛలో భాగమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నోటా ఐచ్ఛికాన్ని మొదటిసారిగా ఢిల్లీ, మిజోరాం, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో (2013లో) ప్రవేశపెట్టారు. నోటా అనేది కేవలం ఓటరుకున్న ఐచ్ఛికం మాత్రమే. అభ్యర్థి గెలుపు/ఓటమిని ప్రభావితం చేయదు. ఒకవేళ నోటాకే ఎక్కువ ఓట్లు వచ్చినా కూడా, తర్వాత స్థానంలోని వ్యక్తి గెలుపొందినట్లుగా ప్రకటిస్తారు.

## ఎన్నికల సంస్కరణలు అత్యావశ్యకం

ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశాల్లో మనది రెండోస్థానం. ఇక్కడ సాధారణ ఎన్నికల నిర్వహణ ఒక మహత్తర కార్యక్రమం. సుపరిపాలన అందిస్తామని, మెరుగైన ఆర్థిక, సాంఘిక సమానత్వం సాధిస్తామని, పేదరిక నిర్మూలనకు మరింత కృషి చేస్తామని ప్రతి పార్టీ ప్రజలకు వాగ్దానం చేస్తుంది, కానీ అవినీతి పరులైన కొందరు రాజకీయ నాయకులు, నేరచరితులు, ఓట్ల కోసం కుల, మతాలను వాడి, ధన బలంతో ఓట్లను కొంటున్నారు. ఈ ధోరణులు పటిష్టమైన ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నాయి.

ప్రజాస్వామ్య ప్రక్రియలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ, కొందరు నీతిపరులైన, అంకితభావం కలిగిన రాజకీయ నాయకుల ఉదాహరణలు మన ప్రజాస్వామ్యం గర్వపడేలా చేశాయి.

- మెరుగైన ప్రజాస్వామ్యానికి, నీతివంతమైన ప్రభుత్వానికి మీరు ఎటువంటి సూచనలు చేయగలరు?
- ఎన్నికలలో రిజర్వేషన్లు ఒక పర్యాయం కంటే ఎక్కువగా ఒకే వ్యక్తి పొందుతుంటే, అదే సామాజిక వర్గానికి చెందిన మిగతావారికి ఎలా అవకాశం వస్తుంది? మీ అభిప్రాయాన్ని చర్చించండి.
- ఎన్నికలలో డబ్బును విపరీతంగా ఖర్చు చేసి గెలిచిన అభ్యర్థి ఆలోచనా విధానం ఎలా ఉంటుంది? డబ్బును తీసుకొని ఓటు వేస్తే, గెలిచిన ప్రజాప్రతినిధిని తమ సమస్యల పరిష్కారానికై అడిగే నైతిక హక్కు ప్రజలకు ఉంటుందా? చర్చించండి.

SCERT TELANGANA

## పోస్టల్ బ్యాలెట్

ఎన్నికలలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది, తమ స్వంత ప్రాంతాల్లో కాకుండా ఎక్కడెక్కడో విధులు నిర్వహిస్తుంటారు, కాబట్టి వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే వారికి వీలుపడదు. దీనిని నివారించడానికి ఎన్నికల కమీషన్ 'పోస్టల్ బ్యాలెట్' సౌకర్యం కల్పించింది. 'పోస్టల్ బ్యాలెట్' అనగా ఎన్నికల విధులకు కేటాయించబడినటువంటి సిబ్బంది, ఎన్నికల తేది కంటే ముందే తమ ఓటు హక్కును బ్యాలెట్ పేపర్ ద్వారా వినియోగించుకొంటారు. వీటిని సంబంధిత అధికారులు వారివారి స్వంత పోలింగ్ స్టేషన్‌లకు ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా పంపిస్తారు.

### ఎన్నికల రద్దు

న్యూఢిల్లీ: దేశ ఎన్నికల సంఘ చరిత్రలో తొలిసారిగా తాను విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌ను తానే రద్దు చేసింది. ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అరవ్ కురిచి, తంజావూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఓటర్లకు భారీగా డబ్బును పంచుతున్నారన్న ఆరోపణలతో ఎన్నికల సంఘం 2016 మే 16న జరగాల్సిన ఉప ఎన్నికలను వాయిదా వేసింది. ఎన్నికల సంఘం కొద్ది కాలం తర్వాత ఎన్నికలు నిర్వహించింది.

### కీలకపదాలు

1. ఓటు 2. ఎన్నికల ప్రవర్తనా నియమావళి 3. ఈ.వి.యం 4. నియోజకవర్గం 5. నోటా

### మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. చర్చించండి.
2. భారతదేశంలో ఎన్నికల కమీషన్ పాత్రను వివరించండి.
3. ఎన్నికల సంఘం విధులను పేర్కొనండి.
4. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రజాస్వామ్యంలో ఎందుకు అవసరం.
5. ఓటు వేయడంతో మన బాధ్యత తీరిపోదు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి మనం నిరంతరం జాగరూకులమై ఉండాలనే వ్యాఖ్యలతో ఏకీభవించేలా మీ అభిప్రాయాల్ని రాయండి.
6. మీ ప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో అనుచిత ప్రవర్తనలు ఏమైనా గమనించారా? నియమావళిలోని ఏ నిబంధనను అతిక్రమించారు?
7. ఎన్నికల సంస్కరణలు అత్యావశ్యకం అనే పేరా చదివి మీ యొక్క అభిప్రాయాల్ని వెల్లడించండి.
8. ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఓ కరపత్రాన్ని తయారు చేయండి.

### ప్రాజెక్టు

- దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన ఆదర్శవంతమైన రాజకీయ నాయకుల గురించి తెలుసా? వారి జీవితాల నుండి మనం ఏమి నేర్చుకోవచ్చు.
- ఈ మధ్యకాలంలో జరిగిన లోక్‌సభ / రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను సేకరించి పట్టికగా రూపొందించి విశ్లేషించండి.

SCERT TELANGANA